# భక్తనందనార్

భగవద్భక్తికి యేది ప్రధానము? ధనము కాదు. కులము కాదు. గోత్రము కాదు. వాల్మీకి ఎవ్వని వంశమందలివాడు? నందుండే పల్లెయందు పుట్టె? ధర కుచేలుండెంత ధనము కల్గియుండె? గజరాజు ఏ విద్య గల్గియుండె? శబరి ఎంతటి శక్తి కల్గియుండె? విదురునికెంతటి వితరణమతియుండె? తిమ్మనికెంతటి తెలివియుండె? కనుక, భగవంతునికి కావలసినది హృదయమే! పరమ భక్తుడైనవానికి పరమాత్ముడే దాసుడైపోతాడు. అందుచేతనే భగవంతునికి 'భక్త పరాధీనుడు' అని పేరు వచ్చింది.

**అందరూ సమానమే**

నందనార్ ఒక రైతు దగ్గర పని చేస్తూ ఉండేవాడు. ఏ పని చేస్తున్నప్పటికీ అతడు నిరంతరమూ ఈశ్వర నామాన్ని స్మరిస్తూ ఉండేవాడు. ఒకనాడు అతను దేవాలయానికి వెళ్ళాడు. కాని, ఈశ్వరుని దర్శనం కాలేదు. ఆనాటి పద్ధతుల ప్రకారం పూజారులు నందనార్‌ను దేవాలయం లోనికి అనుమతించేవారు కాదు. అతడు హీన కులానికి చెందినవాడని, అంటరానివాడని భావించేవారు. నందనార్‌యొక్క యజమాని కూడా చెప్పాడు, 'ఒరేయ్ పిచ్చివాడా! ఉన్నత కులమువారంతా జపములు, ధ్యానములు, యజ్ఞములు, యాగములు చేయవచ్చును. నీకు, నాకు అవన్నీ ఎందుకురా? ఏదో పంటలు పండించుకుంటూ జీవితాన్ని గడుపుదాము' అనేవాడు. నందనార్ తన యజమానితో, 'ప్రభూ! అందరూ దేవుని బిడ్డలే, అందరూ మానవులే. ఐతే, ఈ ప్రపంచాన్ని పోషించే నిమిత్తమై భగవంతుడు కొన్ని తరగతులను యేర్పరచాడు. కాని, అందరూ సమానమే!' అని సమాధానం చెప్పేవాడు.

దీనికొక చిన్న ఉదాహరణ. గవర్నమెంటులో ప్రైమినిష్టరు ఉంటాడు. ట్రాన్స్‌పోర్టు మినిష్టరు ఉంటాడు. ఎడ్యుకేషన్ మినిష్టరు ఉంటాడు. ఈవిధంగా ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్కడు ఉంటాడు. అంతమాత్రముచేత వీరందరిదీ వేరువేరు కులములా? కాదు. కాదు. అందరూ మానవులే. అదేవిధముగా, ఈ లోకాన్ని సంరక్షించే నిమిత్తమై భగవంతుడు మానవులను నాలుగు భాగాలుగా విభజించాడు. ధర్మశాస్త్రములను, వేదములను శాశ్వతంగా నిలబెట్టటానికి 'విప్రుల'నే పేరుతో కొంతమందిని నియమించాడు. దేహాన్నైనా అర్పించి దేశాన్ని సంరక్షించటానికి 'క్షత్రియుల'నే పేరుతో కొంతమందిని నియమించాడు. ధర్మాన్ని రక్షించేవారికి, దేశాన్ని కాపాడేవారికి ఆహారాన్ని పండించి అందించటానికి శూద్రులనే తెగను నియమించాడు. ఇంక ఎగుమతి దిగుమతి చేస్తూ వ్యాపార సంబంధమైన విషయాలను చూడటానికి వైశ్యులనే పేరుతో మరికొంతమందిని నియమించాడు.

దీనికే వేదముకూడను 'బ్రాహ్మణోస్య ముఖమాసీత్ బాహూ రాజన్యః కృతః...' అన్నది. బ్రాహ్మణుడు ఈదేహంలో ముఖమువంటివాడు. ఈదేహాన్ని రక్షించే నిమిత్తమై అందించబడిన హస్తములే క్షత్రియులు. ఇంక వైశ్యుడెవరు? ఇతడు ఆహారాన్ని చక్కగా ఎగుమతి దిగుమతి చేసుకుంటూ శరీరంలోని సర్వాంగములకు ఆహార రసాన్ని సరఫరా చేస్తాడు. ఈ దేహము అన్నముపై ఆధారపడియున్నది. కనుక, దేహము నిలబడాలంటే అన్నమును అభివృద్ధి చేసుకోవాలి. దీనినిమిత్తమై శూద్రులనే తెగ ఏర్పడినది. కనుక, మన దేహంలో బ్రాహ్మణుడు తల, క్షత్రియులు భుజములు, వైశ్యుడు ఉదరము, శూద్రులు కాళ్లు. ఐతే యీ నాలుగు వేరువేరుగా ఉన్నాయా లేక అన్నీ కలసే ఉన్నాయా? పనులు వేరువేరు కాని, అన్నీ కలసి ఒక్కటే! ఒకదానితో నొకదానికి ఎంతో సన్నిహిత సంబంధబాంధవ్యమున్నది. దారిలో నడుస్తుంటే కన్ను ముల్లును చూస్తుంది. తక్షణమే కాలు దానిని దాటుతుంది. ఈవిధంగా కన్నుకు, కాలుకు, ఎంత సన్నిహిత సంబంధముంటున్నదో చూడండి. కాలుకేదైనా దెబ్బ తగిలితే కన్ను ఏడుస్తుంది. అనగా, శూద్రునికేదైనా అపాయం జరిగితే బ్రాహ్మణుడు బాధ పడతాడు. బ్రాహ్మణుడు ఏదైనా ముల్లును చూస్తే, 'నాయనా! దానిని దాటుకో. దెబ్బ తగిలించుకోవద్దు' అని శూద్రుని హెచ్చరిస్తాడు. ఒకరితోనొకరికి ఉండే యీవిధమైన అంతర్ సంబంధాన్ని

ఈనాడు భారతీయులు మరచిపోయారు.

**పనిపూర్తి చేయించిన పైవాడు**

'అయ్యా! అందరమూ మనుష్యులమే, భగవంతుని బిడ్డలమే! కాబట్టి, నేనెందుకు భగవంతుని చూడకూడదు? చూసే తీరాలి' అని నందనార్ పట్టుపట్టాడు. 'రెండు దినములలో చిదంబరంలో నటరాజస్వామి ఉత్సవం జరుగుతుంది. నటరాజస్వామిని తప్పక దర్శించాలి' అని తన నిర్ణయాన్ని యజమానికి తెలియజేశాడు. 'ఓరి పిచ్చివాడా! నీవు పది ఎకరములలో ధాన్యము కోయవలసి ఉంది. దానిని సంచులలోనికి నింపి యింటికి చేర్చి నీవెక్కడికైనా వెళ్ళు' అన్నాడు. 'ఏమిటిది? పది ఎకరముల భూమిలో పండిన పంటను నేనెప్పుడు కోసేది? ధాన్యాన్ని సంచులలోనికి ఎప్పుడు నింపేది? వాటిని ఇంటికెప్పుడు చేర్చేది? ఇంకెప్పుడు నేను వెళ్ళేది? పది రోజులైనా ఈ పనిని ఎవ్వరూ చేయలేరు? అని చింతించి ఈశ్వరుని ప్రార్థించాడు. 'ఈశ్వరా! నీవే నాకు దిక్కు. ఎట్లైనా సరే రేపటి దినమున నేను నీ దర్శనం చేసుకోవాలి' అని పట్టుదలతో నిద్రాహారాలను మాని ఈశ్వరుని ధ్యానించాడు.

అతని పట్టుదల చాలా గొప్పది. భావప్రియుడైన భగవంతుని హృదయం కదిలింది. ఎక్కడినుండో వందలాది ప్రజలు వచ్చి పంటను కోసారు. ధాన్యాన్ని సంచులలో నింపారు. వాటిని బండ్లలో తెచ్చి రైతు యింట్లో పెట్టారు. తెల్లవారేసరికి అన్ని పనులూ అయిపోయినవి. ఈ వచ్చిన వారిని నందనార్ మునుపెన్నడూ చూసి ఎరుగడు. 'ఎవరు వీరంతా? నాకు సహాయం చేస్తున్నారే?' అని ఆశ్చర్యపోయాడు. 'ఈశ్వరా! నీవే యిన్ని రూపాలలో వచ్చావా!' అని ఎంతో ఆనందించాడు. తెల్లవారేటప్పటికి పని పూర్తయ్యేసరికి ఆ యజమాని చాలా సంతోషించాడు. నందనార్ వీపు తట్టి, 'నాయనా! ఇంక నీవు చిదంబరం వెళ్లి నటరాజస్వామిని దర్శించుకొనిరా' అని పంపించాడు.

**హాసవిలాసం**

నడువలేక నడువలేక నందనార్ చిదంబరం చేరుకున్నాడు. అక్కడికి వెళ్ళిన తరువాత దేవాలయద్వారం వద్ద పడిపోయాడు. 'ఈశ్వరా! ఇంత దూరం వచ్చాను కాని, నిన్ను దర్శించుకోలేకపోతున్నానే...! ఈ ప్రాణం ఎప్పుడు పోతుందోయేమో! దేహమొక నీటిబుడగ. మనస్సొక పిచ్చికోతి. కాని, ఈ రెండింటినీ ఆధారం చేసుకొని నీ దగ్గరకు వచ్చాను. ఇంక నీవేమైనా చేసుకో' అంటూ తనను తాను అర్పితం చేసుకొని పడిపోయాడు. ఆనాటి రాత్రి ఈశ్వరుడు పూజారి కలలో కనిపించి, 'నాయనా! ద్వారం దగ్గర నా పరమ భక్తుడు స్పృహతప్పి పడిపోయాడు. అతనిని చక్కగా ఆదరించి ఆహార సదుపాయములను అందించి ఎత్తుకొని నా దగ్గరకు తీసుకొనిరా' అని ఆదేశించాడు.

మరునాడు నటరాజస్వామి ఉత్సవం సందర్భంగా వేలాదిమంది దేవాలయానికి వెడుతున్నారు. ఈశ్వరుని ఆజ్ఞానుసారం పూజారి వెళ్ళి ద్వారం దగ్గర స్పృహతప్పి పడియున్న నందనార్‌ను చూసాడు. అతనికి తీర్థప్రసాదాలను తినిపించి అతనిని ఎత్తుకొని గర్భగుడి దగ్గరకు వచ్చాడు. నందనార్ కన్నులు తెరచి ఒక్కతూరి ఈశ్వరుని దర్శించాడు. ఈశ్వరుడు ఒక్కసారిగా ఫక్కున నవ్వాడు. ఆ నవ్వులోనే నందనార్ ఐక్యమైపోయాడు.